



జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ శశాంక

బ్యాంకర్లు రుణ లక్ష్యాలను చేరుకోవాలి

» జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 27 : బ్యాంకర్లకు నిర్ధేశించిన రుణ లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీసీసీ-డీఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి ఉద్దేశించి రూ.49,815.36 కోట్ల రూపాయల రుణాల లక్ష్యంతో రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రెడిట్ ప్లాన్‌ని రూ. రూ.49,815.36 కోట్లతో గత సంవత్సరం కంటే రూ.25,648.36 కోట్ల పెరుగుదలతో (28.17 శాతం వృద్ధిని) అంచనా వేశామని తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ. 6,166.81 కోట్లు, ప్రాధాన్యతా రంగం నుండి రూ.15,086.07 కోట్ల మేజర్ కాంపోనెంట్ ఎంఎస్ఎంకి కేటాయించామన్నారు. మారుమూల ప్రాంతాలు, బ్యాంకులు లేని గ్రామాలలో తగిన సంఖ్యలో బీసీ పాయింట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి అకౌంట్‌కు ఆధార్ కార్డ్, పాన్‌కార్డ్ ఉండాలని తెలిపారు. ఆపరేటివ్ ఖాతాల కోసం మొబైల్ నంబర్, పెన్షన్, రైతుబంధు, గ్యాస్ సబ్సిడీ, పీఎం కిసాన్, సమ్మాన్ నిధి వంటి డీబీటీ ప్రయోజనాలను పొందేందుకు లబ్ధిదారులకు సులభతరం చేయడానికి పీఎంజీఎస్‌వై/పీఎంఎస్‌బీవై బీమా పథకాల కింద ఖాతాదారులందరినీ కవర్ చేయాలన్నారు. జిల్లాలో ఆర్థిక సహాయ పథకాలను గ్రౌండింగ్ చేసి లక్ష్యాలను సాధించినందుకు బ్యాంకర్లు, సెక్టోరల్ హెడ్‌లు, డీఆర్‌డీఏ, డీఐసీ, మెప్మా అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, ఆర్బీఐ, నాబార్డు ఏజీఎం, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం : యువత మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ ఆవరణలో పోలీసు, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ. వైద్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వాక్ తాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగువంటిదన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యమన్నారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలన్నారు. తమ పరిసరాలు, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సునీతారెడ్డి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, క్రైం డీసీపీ అరవింద్ బాబు, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ నరేందర్‌గౌడ్ వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని.. డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, నాతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రెండో జత యూనిఫామ్ త్వరగా అందించాలి

విద్యార్థులకు రెండో జత యూనిఫామ్ త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్కూల్ యూనిఫామ్ పంపిణీ, పాఠశాలల మర్మమతులపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో గ్రామీణ, పట్టణ, మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో జత యూనిఫామ్ త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, పీఆర్ ఈఈ, ఇంజనీర్ అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.



ధాన్యం అమ్మకం వివరాలు

- సాగైన వరి పంట 1,13,311 ఎకరాలు
- ప్రతిపాదిత కేంద్రాలు 39
- ఓపెన్ చేసిన కేంద్రాలు 33
- ధాన్యం సేకరణ లక్ష్యం 40,000 మెట్రిక్ టన్నులు
- ధాన్యం అమ్మిన రైతులు 2,227
- సేకరించిన ధాన్యం 11,956.120 మెట్రిక్ టన్నులు
- చెల్లించిన డబ్బులు రూ. 26.33 కోట్లు

లక్ష్యం బారెడు.. కొనుగోళ్లు మూరెడు అన్నట్టుగా ఉంది జిల్లాలో ధాన్యం సేకరణ పరిస్థితి. ప్రభుత్వ రంగ సంస్థలు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నామమాత్రమే. ప్రభుత్వ సంస్థలు సవాలక్ష నిబంధనలు, కొర్రీలు పెడుతుండడంతో ఎక్కువమంది రైతులు ప్రైవేటు వ్యాపారులకే అమ్ముతున్నారు. వారు తాలు, తేమ శాతాన్ని పట్టించుకోకపోవడంతో పాటు కల్లాల వద్దకే వచ్చి ప్రభుత్వ మద్దతు ధరకంటే ఎక్కువ పెట్టి కొంటున్నారు. దీంతో రైతులకు రవాణా ఖర్చులు కూడా తగ్గుతున్నాయి. వీటన్నింటినీ బేరీజు వేసుకున్న రైతులు ప్రైవేటు వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యం లక్ష్యాన్ని చేరుకోలేక పోతోంది.

లక్ష్యం చేరని కొనుగోళ్లు!

ఈసారి ధాన్యం కొన్నది తక్కువే

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 27 : ఏటా అన్నదాతల ఆందోళనలు.. ధర్నాలు.. రాస్తారోకోల నడుమ ధాన్యం సేకరణ జరిగేది. ఈ సారి ఎలాంటి అవరోధాలకు తావులేకుండా కొనుగోళ్లు సాగాయి. ఇందుకు ప్రధాన కారణం పొలాల వద్దకు వచ్చి కల్లాల్లో కంటాలు పెట్టి రైతులకు శ్రమ లేకుండా ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందులో సగం వరకు మాత్రమే సేకరించారు. లక్ష్యం కొండంత.. సేకరణ గోరంత అన్న చందంగా మారింది. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యారు. గత ఏడాది యాసంగిలో 20,451.480 మెట్రిక్ టన్నులు సేకరించగా.. ఈ సారి యాసంగిలో 11,956.120 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు.

» ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి రైతులు విముఖం
» కల్లాల్లోనే కొనుగోలు చేసిన వ్యాపారులు
» జిల్లాలో ముగిసిన ధాన్యం సేకరణ
» సేకరించింది 11,956.120 మెట్రిక్ టన్నులే
» ఏటేటా తగ్గుతున్న ధాన్యం సేకరణ లక్ష్యం
» ప్రైవేట్‌కు మొగ్గు చూపుతున్న రైతులు
» కొనుగోళ్ల లక్ష్య సాధనలో సర్కార్ విఫలం

సన్నాలకు పెరిగిన డిమాండ్

ప్రైవేట్ వ్యాపారులకు తోడు చాలామంది నేరుగా రైతుల వద్ద సన్నరకం వడ్లను కొనుగోలు చేసి మర ఆడించి బియ్యంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ కేంద్రాలతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు అటు వైపే మొగ్గు చూపారు.

తేమ శాతంతో పనిలేదు

ప్రభుత్వం క్వింటాలు ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 చొప్పున మద్ధతు ధర చెల్లిస్తోంది. తేమ 17 శాతం ఉండడంతో పాటు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వడ్లనే మిల్లర్లు సేకరిస్తున్నారు. దీనికి తోడు 40కిలోల సంచికి మూడు కిలోల మేర తరుగు ఇవ్వాలి. అలాగే రవాణా చార్జీలతో ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాల్సి వస్తుంది. అయితే వ్యాపారులు తేమతో పని లేకుండా క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధరతోనే పంట కల్లాల వద్దనే కొనుగోలు చేశారు. హమాలీతో పాటు ఇతర ఖర్చులన్నీ వారే భరించారు. దీంతో రైతులకు ఆర్థికంగా కలిసి వచ్చింది.

సాధారణానికి మించి వరి సాగు

జిల్లాలో ఈ సారి (2023-24) యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 52,470 ఎకరాలు కాగా 1,13,311 పైగా ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. సాధారణ సాగును మించి రైతులు వరి పంట వేశారు. పంట విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ సారి 40వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు పోను మిగతా ధాన్యం సేకరించాలనుకున్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలో 39 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినప్పటికీ 33 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 40వేల మెట్రిక్ టన్నులు వరి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్రాలు ముగిసే నాటికి 11,956.120 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. ప్రతీ సంవత్సరం ధాన్యం సేకరణ లక్ష్యం తగ్గుతూ వస్తోంది. నిర్దేశించిన లక్ష్యంలో కనీసం సగం కూడా సేకరించడం లేదు. ఇందుకు కారణాలు అనేకం ఉన్నాయి. తూకంలో మోసం, తాలు పేరిట దోపిడీ, టార్పాలిన్లు, గోనె సంచులు అందుబాటులో ఉంచక పోవడం. అలాగే సకాలంలో డబ్బులు అందక పోవడం వంటి కారణాలతో కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకు రావడానికి అనాసక్తి చూపించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువగా చెల్లించడం. కల్లాల వద్దకే వెళ్లి ధాన్యాన్ని సేకరించడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. దీంతో చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు వెలవెలబోయాయి. ఈసారి ప్రైవేట్ వ్యాపారులు పచ్చి వడ్లనే కొనుగోలు చేశారు. వరి ఆరబెట్టడం.. రవాణా చార్జీలు మిగలడం, రైతులకు లాభం ఉండటంతో ప్రైవేటుకే మొగ్గు చూపారు.

ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాను



పదెకరాల్లో వరి పంట సాగు చేశాను. 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రైవేట్ వ్యాపారులు పొలం వద్దకు వచ్చి ధాన్యం కొన్నారు. క్వింటాకు రూ.2,700 చెల్లించారు. గత ఏడాది వేరు శనగను ప్రభుత్వ సంస్థకు అమ్మితే సకాలంలో డబ్బులు రాలేదు. దీంతో పెట్టుబడికి కష్టమైంది. ఈసారి ప్రైవేట్ వ్యాపారులకు అమ్మాను, డబ్బులు కూడా వెంటనే చెల్లించారు.

- మహ్మద్ హాఫీజుల్లా, రైతు, తుమ్మలపల్లి

ఇంకా డబ్బులు జమ కాలేవు



అరెకరంలో వరి పంట సాగు చేశాను. 30 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. షాద్‌నగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాను. 15 రోజులైనా ఇప్పటి వరకు డబ్బులు అకౌంట్లో జమ కాలేదు. త్వరగా డబ్బులు జమ చేయాలి.

- బుడంముళ్ల అంజయ్య, రైతు, ఉబ్బగుంట గ్రామం

కల్లం వద్దకే వచ్చి కొన్నారు



11 ఎకరాల్లో వరి వేశాను. 250 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కల్లం వద్దకు ప్రైవేట్ వ్యాపారులు వచ్చి ధాన్యం కొన్నారు. తేమ శాతం, తాలు వంటివి ఏమీ చూడలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వెళితే తరుగు పేరిట బస్తాకు మూడు కిలోలు దోచుకునే వారు. పొలం వద్దకి వచ్చి వడ్లు కొనడంతో మాకు రవాణా భారం కూడా తగ్గింది.

- అంకం పాడు, రైతు, లక్ష్మీదేవిపల్లి

ప్రభుత్వ సంస్థల ధాన్యం సేకరణ ఇలా..

ఏజెన్సీ	రైతులు	పంపిణీ చేసిన గన్నీబ్యాగులు	సేకరించిన ధాన్యం (టన్నుల్లో)
పీఏసీఎస్	482	95,400	2,450.680
డీసీఎంఎస్	1,542	2,27,250	8,686.360
ఐకేపీ	203	33,000	819.080
మొత్తం	2,227	3,55,650	11,956.120



మైనింగ్‌కు అనుమతులు ఇవ్వద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గ్రామస్థులు

మైనింగ్ తవ్వకాలకు అనుమతులివ్వొద్దు

ఆర్డీవో ఆధ్వర్యంలో అంతారంలో ప్రజాభిప్రాయ సేకరణ

» అనుమతులు ఇవ్వద్దని గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం
» ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్న చేవెళ్ల ఆర్డీవో సాయిరాం

చేవెళ్ల, జూన్ 27 : పర్యావరణానికి, ప్రజలకు, జీవకోటికి నష్టం కలిగించే మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వద్దని అంతారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల మండలం అంతారం గ్రామంలోని సర్వేనెంబర్ 185లో ఉన్న 54 ఎకరాల్లో ఎస్ఆర్ మినరల్స్ మైనింగ్ తవ్వకాల కోసం అనుమతులు కావాలని కోరటంతో పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీవాత్సవ్, బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, ఎన్‌జీవోలు, గ్రామస్తులు, రైతుల సమక్షంలో అభిప్రాయ సేకరణ చేశారు. పంచాలింగాల గుట్టపై కొంతకాలంగా జరుగుతున్న మైనింగ్ తవ్వకాలతో ఎంతో నష్టం జరిగిందని.. ఇక మీదట ఇక్కడ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వద్దని గ్రామస్తులు అధికారులను కోరారు. దీనిపై గ్రామస్తులు తీర్మానం కూడా చేసి అధికారులకు అందించారు. మైనింగ్ తవ్వకాలతో గుట్టలన్నీ మాయం అవుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఎస్ఆర్ మినరల్స్ యాజమాన్యం, సిబ్బంది అంతారం ప్రజలతో పాటు రైతులపై దౌర్జన్యం చేశారని గ్రామస్తులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వద్దని చెప్పినా ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. ప్రస్తుతం ఎట్టి పరిస్థితిలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని అధికారులకు గ్రామస్తులు గట్టిగా చెప్పారు. .గ్రామంలో మైనింగ్ తవ్వకాలు జరుపొద్దని గ్రామస్తులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. గ్రామస్తులు చెప్పిన వివరాలను ప్రభుత్వానికి అందిస్తామని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం వివరించారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మైనింగ్ త్వవకాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. గ్రామంలో మైనింగ్ ఏర్పాటు చేస్తే పర్యావరణంతో పాటు భవిష్యత్తులో గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పశువులకు మేత కరువవుతుందన్నారు. రైతులు, ప్రజలపై ఎస్ఆర్ మినరల్స్ యాజమాన్యం దౌర్జన్యం చేయడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వద్దన్నారు. ఇక్కడి ప్రజల అభిప్రాయాన్ని పొల్యూషన్ బోర్డు దృష్టికి తీసుకెళతానన్నారు. అవసరమైతే ప్రజలకు జరుగుతున్న నష్టంపై కోర్టుకు కూడా వెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, పలువురు రైతులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విస్తరణ ఎప్పుడో?



విస్తరణకు నోచుకోని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి

» 2013లో జాతీయ రహదారిగా హైదరాబాద్ - శ్రీశైలం రోడ్డు
» నాలుగింతలు పెరిగిన వాహనాల రద్దీ
» రోడ్డు విస్తరించక పెరిగిపోతున్న ప్రమాదాలు
» రెండు లేన్ల రోడ్డుతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
» రోడ్డు విస్తరించాలని కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం వినతి

ఆమనగల్లు, జూన్ 27 :హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ రోజు రోజుకూ పెరిగిపోతోంది. నిత్యం హైదరాబాద్ నుంచి ఈ రహదారి మీదుగా వేల వాహనాలు, లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి విస్తరణ చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి విస్తరించాలని ఏళ్ల కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు మార్గాన తుక్కుగూడ, కందుకూరు, కడ్తాల, ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి, డిండి మీదుగా శ్రీశైలం, కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ మీదుగా నంద్యాలకు వెళ్లే ఈ రహదారి పదేళ్ల కాలంగా విస్తరణకు నోచుకోలేదు. రెండులేన్ల ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలని చాలా కాలంగా ప్రయాణికులు కోరుతున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రం మంత్రి కిషన్ రెడ్డిలు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలు మార్లు కలిసి నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించాలని కోరారు. గత ఎంపీ పోతుగంటి రాములు, ప్రస్తుత ఎంపీ డాక్టర్ మల్లు రవి, జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు కూడా మంత్రిని కలిసి రోడ్డు విస్తరణ ఆవశ్యకత గురించి వివరించారు. అయినా నేటికి ఎలాంటి స్పందన లేదు. ఈ జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణకు కేంద్రం రెండేళ్ల క్రితమే రూ.1,275 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినా నేటికీ నిదులు విడుదల కాలేదు.



హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై రాంనుంతల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

765కు అనుసంధానంగా 167కే జాతీయ రహదారి నిర్మాణం

కల్వకుర్తి సమీపంలోని కొట్రగేటు నుంచి కొల్లాపూర్‌లోని సోమశిల, కరివెన మీదుగా ఏపీలోని నంద్యాల వరకు కొత్తగా 167 కే జాతీయ రహదారిని గుర్తించి ఏడాది క్రితం పనులు చేపట్టారు. కొత్తగా ప్రకటించిన 167 కే జాతీయ రహదారి హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండడంతో ముందుగా ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తే తప్ప ప్రయోజనం ఉండదని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. సోమశిల మీదుగా కొత్తగా నిర్మించే జాతీయ రహదారి పూర్తయితే హైదరాబాద్ నుంచి కల్వకుర్తి మీదుగా తిరుపతి వెళ్లడానికి దూరం తగ్గనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరిస్తేనే శ్రీశైలం, తిరుపతి జాతీయ రహదారులు అనుసంధానం అయి వాహనాల రద్దీని తట్టుకోగలుగుతుంది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీకి ఇచ్చిన వినతిపత్రంలో ప్రస్తావించారు.


2013లో జాతీయ రహదారిగా గుర్తింపు

అర్‌అండ్‌బీ శాఖలో ఉన్న హైదరాబాద్ -శ్రీశైలం రహదారిని 2013లో 765వ నంబర్ జాతీయ రహదారిగా గుర్తించారు. తెలంగాణలో రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 191 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 79 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఏపీలోని తోకపల్లి వరకున్న 270కి.మీ రోడ్డును రూ.320 కోట్లతో అభివృద్ధి చేశారు. అప్పట్లోనే నాలుగు లేన్లుగా రోడ్డును విస్తరించాలని స్థానిక నాయకులు, ప్రజలు కోరినా అప్పటి వాహనాల, ప్రయాణికుల రద్దీకనుగుణంగా రెండు లేన్ల రోడ్డుగా నిర్మాణం చేసి మైసిగండి, హాజీపూర్‌ల వద్ద టోల్‌గేట్లు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు హైవేగా మారడంతో ప్రయాణానికి ఇబ్బందులుండవని భావించిన ప్రయాణికులు ఇప్పుడు దీనిపై ప్రయాణమంటేనే భయపడుతున్నారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోయాయి. తుక్కుగూడ మొదలు కల్వకుర్తి వరకు ఏడాది కాలంలో సుమారు 50మంది వరకు మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయాలపాలయ్యారు. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు లేకపోవడం, ఉన్న రోడ్డులో డివైడర్ లేక ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్‌హెచ్ఏఐ అధికారులు కూడా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


సీఎం దృష్టికి తీసుకెళ్లాం



హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగులేన్లుగా విస్తరించాలని సీఎంకు విన్నవించాం. ప్రధాని, కేంద్రమంత్రి గడ్కరీని సీఎం కలిసి రహదారి విస్తరణ గురించి వివరించారు. కేంద్రంపై చాలా కాలంగా ఒత్తిడి తెస్తున్నాం. 765 జాతీయ రహదారిని విస్తరించడానికి కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

- కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

కేంద్రంపై ఒత్తిడి తెస్తా



శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగి పోయింది. ఈ నేపథ్యంలో రోడ్డును విస్తరించాల్సి ఉంది. రహదారి విస్తరణ గూర్చి ప్రధాని, కేంద్రమంత్రి గడ్కరీకి విన్నవిస్తా. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తా. రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యల గురించి ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి తీసుకు వెళతా.

- డాక్టర్ మల్లు రవి, నాగర్‌కర్నూలు ఎంపీ

బెంచీలపై కూర్చోవాలంటే మోసుకొచ్చుకోండి

- ప్రిన్సిపాల్ ఆదేశంతో బరువైన బెంచీలు మోసిన కళాశాల విద్యార్థినులు
- నిధులు, అటెండర్ లేడంటూ సాకు
- తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘటన



బెంచీలు మోస్తున్న తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

తాండూరు, జూన్ 27: ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థినులకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాండూరు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. మొన్న కళాశాల నూతన భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్ తాళం వేసుకుని వెళ్లాడు. ఎట్టకేలకు గదులు తెరిచినా ఆ గదుల్లో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేవు. బెంచీలపై కూర్చోవాలంటే బెంచీలు మోసుకొచ్చుకోండి అంటూ ప్రిన్సిపాల్ చెప్పిన మాటలను విద్యార్థినులు పాటించకతప్పలేదు. దీంతో విద్యార్థినులు చేసేది లేక తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థినులు బెంచీలు మోశారు. దాదాపు 200మీటర్ల దూరం మొదటి అంతస్థులోకి ఆయాసపడుతూ బెంచీలు మోశారు. అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కూడా లేబర్ పెడదామంటే నిధులు లేవని, అటెండర్‌ను కూడా ప్రభుత్వం నియమించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సాకుగా చెబుతున్నారు. తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజుల కిందట రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్త భవనాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించి గదులను అందుబాటులోకి తెచ్చారు. ప్రారంభమైన రెండవ రోజే కాంట్రాక్టర్ డబ్బులు రాలేవంటూ తాళం వేసుకున్నారు. ఎట్టకేలకు గదులు తెరిచారు. గురువారం పాఠశాలకు వచ్చిన విద్యార్థినులు బెంచీలు లేవని ప్రిన్సిపాల్‌ను కోరగా పాత భవనంలో ఉన్నాయి. తెచ్చుకొని వేసుకొండి అంటూ సమాధానం ఇవ్వడంతో విద్యార్థినులు చేసేదిలేక పాత భవనంలో ఉన్న కూర్చీలను కొత్త భవనంలోకి మోసుకెళ్లారు. బరువైన బెంచీలను మోసుకుంటూ వెళ్లి ఎవరి తరగతిలో వాళ్ల బెంచీలను తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా కాలేజీ అమ్మాయిలతో బెంచీలు మోయించడం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు బాధ్యతలను విస్మరించడంపై చర్చనీయాంశమైంది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా విద్యార్థినులు తామే బెంచీలు వేసుకుంటామని చెప్పారని చెప్పడం గమనార్హం.

కులకచర్లలో జోరుగా ఇసుక దందా



కుసుమ సముద్రం దగ్గర ఇసుక డంపు

కులకచర్ల, జూన్ 27:మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. సంబంధిత అధికారులు ఏ చర్యలు తీసుకోకపోవడంతో కొందరికి ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. వర్షాలు లేకపోవడంతో వాగుల్లో ఉన్న ఇసుకను తీసుకొచ్చి డంపింగ్ చేసి విక్రయిస్తున్నారు. మరికొందరు కృత్రిమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్నా అధికారులు ఏచర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కుసుమ సముద్రం గ్రామవాగులో గ్రామానికి చెందిన కొందరు 30ట్రాక్టర్ల ఇసుక తీసి విక్రయించేందుకు డంపింగ్ చేశారు. గటన్నపల్లి తండా మిషన్ భగీరథ ట్యాంకు దగ్గర ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. రాంపూర్ గ్రామ పరిధిలో కొందరు తమ బోరు బావుల దగ్గర ఫిల్టర్ ఇసుకను తయారు చేసేందుకు మట్టిని తెచ్చి సిద్ధంగాఉంచారు. డంపులు చేసిన ఇసుకను రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించి విక్రయిస్తున్నారు. కొందరు ఇసుక విక్రయాన్ని దందాగా మార్చుకొని లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. నిల్వ ఉన్న ఇసుక డంపులపై తహసీల్దార్ మురళీధర్‌ను వివరణ కోరగా కుసుమ సముద్రం గ్రామ పరిధిలో గటన్నపల్లి తండా దగ్గర ఇసుక డంపులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని సీజ్ చేస్తామని తెలిపారు.



గటన్నపల్లి తండాలో నిల్వ ఉన్న ఇసుక డంపు

మున్సిపాలిటీలో మారని ఎంపీ పేరు

- ఇంకా రంజిత్‌రెడ్డి పేరు దర్శనం



మున్సిపాలిటీలో మారని ఎంపీ పేరు

వికారాబాద్, జూన్ 27: చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వర్ రెడ్డి గెలిచి 20రోజులు పూర్తవుతున్న మున్సిపాలిటీలో ఆయన పేరు మాత్రం మారడంలేదు. ఇంకా చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి పేరునే కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లే ముందు ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల పేర్ల బోర్డులో విశ్వేశ్వర్‌రెడ్డి పేరు మార్చాల్సి ఉన్నా అధికారులు మాత్రం ఇంకా పాత పేరును కొనసాగిస్తున్నారు.

మా సారు మాకే ఉండాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ముజాహిద్‌పూర్ గ్రామస్థులు

కులకచర్ల, జూన్ 27: ముజాహిద్‌పూర్ గ్రామ సందని గడ్డ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంతోష్‌కుమార్ బదిలీ నిలిపివేయాలని గ్రామస్థులు గురువారం ఎంఈవో హబీబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన పిల్లలకు చక్కగా బోధించారని, మాసారు మాకే ఉండాలంటూ కలెక్టర్‌కు, డీఈవోకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాస్, అంజి, పులింగ చిన్న వెంకటేశ్, డప్పు రత్నం, పులింగ అంజి, కిన్నెర శ్రీనివాస్, రెడ్డిపల్లి శ్రీనివాస్, తానం రవి, చెరువుల భీమయ్య, మేకల అంజి, దండు మహేశ్, తాన మల్లేశ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భర్తపై దాడి

- హరితహారం చెట్లను ఎందుకు నరుకుతున్నారని ప్రశ్నించిన బాధితుడు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చేవెళ్ల, జూన్ 27: హరితహరం కింద నాటిన చెట్లను నరికివేస్తున్న వారిని ప్రశ్నించిన మాజీ సర్పంచ్ భర్త సత్యనారాయణపై విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బంది దాడిచేశారు. ఈ ఘటన గురువారం చేవెళ్ల మండలం న్యాలటలో చోటు చేసుకుంది. బాధితుడు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాలటలోభారీగా మొక్కలు నాటగా అవి వృక్షాలయ్యాయి. చేవెళ్ల విద్యుత్ కాంట్రాక్టర్ బాపిరెడ్డి తన సిబ్బందితో గ్రామంలో చెట్లను నరికివేయించారు. దీంతో మొక్కలను ఎందుకు నరుకుతున్నారని సత్యనారాయణ ప్రశ్నించాడు. కాంట్రాక్టర్ తొలగించమని చెప్పాడని సిబ్బంది చెప్పారు. దీంతో సత్యనారాయణ బాపిరెడ్డికి ఫోన్‌చేసి అడగగా తాను చెట్లను నరకమని చెప్పలేదని అన్నారు. ఇంతలో అక్కడ ఉన్న నలుగురు సిబ్బంది కోపంతో సత్యనారాయణపై దాడి చేశారు. ఇది గమనించి గ్రామస్తులు వచ్చే సరికే నలుగురూ పారిపోయారు. బాధితుడు సత్యనారాయణ తనపై జరిగిన దాడిపై విద్యుత్ కాంట్రాక్టర్ బాపిరెడ్డి, అతడి సిబ్బందిపై చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది, బాపిరెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని న్యాలట గ్రామస్తులు కోరారు.

పొలాల్లో ఫార్మా కంపెనీలొద్దు

- మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు హెచ్‌ఎం దేశ్‌రథ



రైతులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం దేశ్‌రథ

యాచారం, జూన్ 27: పంట పొలాల్లో ప్రభుత్వాలు ఫార్మాసిటీ, మెగాటౌన్‌షిప్‌లు ఏర్పాటుచేస్తే వాతావరణం కలుషితమై, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, వ్యవసాయ ఉత్పాదకత పడిపోతుందని మ హారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు దేశ్‌రథ అన్నారు. గురువారం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో పర్యావరణవేత్త కవుల సరస్వతితో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నా రు. టౌన్‌షిప్‌లు అన్నం పెట్టవని, విత్తనాలు నాటితే పదిమందికి అ న్నం ఉత్పత్తి అవుతుందన్నారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీకి వందలాది ఎకరాల తీసుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు విత్తనాలు పంపిణీ చే సుంటే ఆహార ఉత్పాదకత పెరిగేదని, వేలాది మందికి ఉపాధి లభించేందన్నారు. ఇక్కడ మెగాటౌన్‌షిప్ ఏర్పాటు నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు తీసుకున్నారో అర్థం కావడంలేదన్నారు. ఫార్మాసిటీ, మెగాటౌన్షిప్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీఎం భూమి లేని పేదలకు పంచి ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమని బంధువుల ఆందోళన

షాద్‌నగర్, జూన్ 27 : షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని మృతుడి కుటుంబీకులు గురువారం ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. కేశంపేట మండలం నర్వకు చెందిన చిర్ర మహేష్ షుగర్ వ్యాధితో బాధపడేవాడు. కుటుంబీకులు అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులు చికిత్స అందించిన వైద్యులు కిడ్నీల సమస్య ఉందని, హైదరాబాద్‌లోని మహావీర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. మహేష్‌ను అక్కడికి తరలించగా డయాలసిస్ చేశారని, ఆ మరుసటి రోజే మృతిం చెందాడని తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.

మైసిగండి ఆలయానికి రూ.40.56లక్షల ఆదాయం



ఆలయంలో వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

కడ్తాల్, జూన్ 27: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయ ఆవరణలో గురువారం పలు వేలం పాటలు నిర్వహించారు. దేవాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ పర్యవేక్షణలో ఫౌండర్‌ట్రస్టీ సిరోలి పంతూ, ఈవో స్నేహలత సమక్షంలో వేలం చేపట్టారు. 2024-25 సంవత్సరానికి శాక్తేయ మొక్కుబడుల రశీదు రుసుము వసూళ్లు చేసుకునే హక్కు వేలంలో ముగ్గురు పాల్గొన్నారు. మైసిగండికి చెందిన దేపావత్ రవి రూ.25,15,000కు వేలాన్ని దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. అలాగే పూలు, పూజ సాజగ్రి అమ్ముకునే హక్కుల ముగ్గురు పాల్గొనగా మైసిగండికి చెందిన ఎం.రాజేశ్ రూ.15,41,000లకు వేలం దక్కించుకున్నాడు. వేలం ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు సదుపాయాల కల్పనకు వెచ్చిస్తామని ట్రస్టీ, ఈవోలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రామవత్ భాస్కర్, అర్చక సిబ్బంది మాదారం యాదగిరి, బోడ్యనాయక్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, అమృనాయక్, పాండునాయక్, గణేశ్‌గౌడ్, సుమన్ పాల్గొన్నారు.

బీమా రంగంలో ఎల్ఐసీకి మించింది లేదు



ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎల్ఐసీ అధికారులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 27: బీమా రంగంలో దేశంలో ఎల్ఐసీకి మించిన సంస్థ లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే ప్రముఖులను కలవాలనే ఎల్ఐసీ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, ఏజెంట్లు ఎల్ఐసీ జడ్చర్ల శాఖ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎన్.జగన్నాథ్ ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నందిగామ మండలం మొదళ్లగూడలో ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డిలను కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో ఉంటున్న భారతీయులకు ఎల్ఐసీ బీమా రక్షణ కల్పిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి పనిచేస్తూ నంబర్ వన్ స్థానానికి చేరుకుందని అభినందించారు. 60ఏళ్ల లోపు రైతులందరికీ ఐదు లక్షల బీమాను కల్పిస్తూ రైతు కుటుంబాలకు అండగా ఉందని గుర్తుచేశారు. ఏజెంట్లు మూరుమూల గ్రామాల్లో బీమా ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తెస్తూ, పొదుపు చేయిస్తూ ఆర్థిక రక్షణను కల్పిస్తున్నారన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ సేవలు మరింత విస్తరించేలా తమ వంతు సమకారం అందిస్తామని శంకర్, నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ మదుసూధన్‌రావు,ఏబీఎం రవీంద్రనాయక్, డీవో సుబ్రహ్మణ్యం, లియాఫీ షాద్‌నగర్ శాఖ ముఖ్య సలహాదారుడు ఎల్.మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు కె.రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి డి.రాజుగౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, ఏజెంట్లు సత్యనారాయణ, యాదయ్య, వెంకటరంగారెడ్డి పాల్గొన్నారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!



న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్‌లను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్‌లను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.

ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్ట్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్టు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగుమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్ట్‌లు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ



హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోదముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్లు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం భరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ.. ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడితోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం

» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలుపడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో క్యాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

పదోన్నతులు కల్పిస్తూ బదిలీలు చేయించండి



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 27:ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసిన పది మండలాల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి బదిలీలను పూర్తిచేయించాలని గురువారం ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మొరపెట్టుకున్నారు. షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఆరు మండలాలను, కల్వకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ నాలుగు మండలాలను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారని గుర్తుచేశారు. ఈ పది మండలాల్లోని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై పాత రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు కోర్టు స్టే తెచ్చుకున్నారని తెలిపారు. ఆ స్టే ఆర్డర్‌ను సైతం రెండు రోజుల క్రితం తాము వేకెట్ చేయించామన్నారు. రాష్ట్రంలో 32 జిల్లాల్లో టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు కొనసాగగా, కేవలం పాత రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల స్వార్థంతో తమకు అన్యాయం జరుగుతోందన్నారు. అలాగే పాత రంగారెడ్డిలోని 2002 డీఎస్సీ టీచర్లకు ప్రమోషన్లు వచ్చాయని, రంగారెడ్డిలో విలీనమైన పది మండలాల్లోని 1989 డీఎస్సీ టీచర్లకు కూడా నేటికీ ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. పాత రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులకు 24శాతం ఉన్న హెచ్ఆర్ఏ.. బదిలీలైతే 11.5శాతానికి పడిపోతుందనే స్టే తెచ్చికొని తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పది మండలాల ఉపాధ్యాయులకు న్యాయంచేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు.

కళా భవనాన్ని పూర్తి చేయిస్తా : ఎమ్మెల్యే

షాద్‌నగర్ అర్బన్, జూన్ 27: ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న కళా భవనాన్ని పూర్తిచేయిస్తానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు. మినిస్ట్రీస్ ఆఫ్ కల్చరల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సభ్యుడు టీవీ రంగయ్య ఆధ్వర్యంలో గురువారం కళాకారులు ఎమ్మెల్యేను కలిశారు. కళా ప్రదర్శనలకు చేపట్టిన కళాభవన నిర్మాణాన్ని అర్ధంతరంగా వదిలేశారని తెలిపారు. భవనాన్ని పూర్తిచేయిస్తే కళాకారులు ప్రదర్శనలతో ఉపాధి పొందుతారని తెలిపారు. బిల్లులురాలేదని కాంట్రాక్టర్ మధ్యలోనే నిర్మాణాన్ని వదిలివేశాడని ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేయించి, కళా భవనాన్ని పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్కార భారతి షాద్‌నగర్ గౌరవ సలహాదారు సింగారం శ్రీనివాస్, కళాకారులు వడ్ల రమేష్‌చారి, రవీందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకొని ఎదగాలి



ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్‌ను అందజేస్తున్న కృష్ణాగౌడ్

చేవెళ్ల, జూన్ 27: విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సీనియర్ న్యాయవాది, చేవెళ్ల మండల బీజేపీ ఉపాధ్యక్షుడు గౌండ్ల కృష్ణాగౌడ్ తెలిపారు. గురువారం కందవాడలోని జెడ్పీహెచ్ఎస్‌కు కృష్ణగౌడ్ ప్రింటర్‌ను బహూకరించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలలోని విద్యార్థుల అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు ఉన్నతచదువులు చదివి జీవితనంలో ఉన్నతస్థానానికి చేరుకోవాలని సూచించారు. అంతకు ముందు ఎచ్ఎం లక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి కృష్ణాగౌడ్ చాలా సహకారం అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరేందర్, దర్శన్‌గౌడ్, టీచర్లు విజయ్‌గౌడ్, రమణారెడ్డి, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, విద్యార్థులు ఉన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : ఏసీపీ



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రంగస్వామి

కొందుర్గు, జూన్ 27: జూలై 1 నుంచి అమలు కాబోయే కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల పోలీసులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఐపీసీ బదులుగా కొత్తగా వస్తున్న భారతీయ న్యాయ సంహిత, సీఆర్పీకి బదులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టాలపై అవగాహన కల్పించారు. పెట్రోలింగ్ డ్యూటీ పోలీసులకు పనిభారం పడకుండా మూడుషిఫ్టుల్లో పనిచేయాలన్నారు. సమావేశంలో షాద్‌నగర్ రూరల్ సీఐ బిసత్యనారాయణ, కొందుర్గు, చౌదరిగూడ ఎస్సైలు జె.కృష్ణయ్య, సక్రం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలయ్యేలా
చర్యలు తీసుకోవాలి



లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జూన్ 27 : పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఆయన కమిషనర్ కృష్ణ ఆదిత్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగం కోసం దేశంలోని వివిధ రాష్ట్రాల వారు పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి యాజమాన్యాలు కనీస వేతనం, రక్షణ పరికరాలు కూడా ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందలాది ఫ్యాక్టరీలు వెలిశాయని, దేశ నలు మూలల నుంచి వేలాది మంది ఇక్కడ పనిచేస్తుండటంతో షాద్‌నగర్ ఒక మినీ ఇండియాగా మారిందన్నారు. కానీ పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు కాక కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని కమిషనర్‌కు వివరించారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 270చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఉండగా వాటిలో సుమారు 31వేల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తూరు, నందిగామ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాల్లో ఉన్న పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేలా రిజర్వేషన్ సౌకర్యం కూడా ప్రవేశపెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో పరిశ్రమల్లో కార్మికులు చనిపోతున్నా లేబర్ శాఖ అధికారులు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రమాదాల్లో మరణించిన వారిని కూడా గుట్టుచప్పుడు కాకుండా వారి ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్, జూన్ 27: ప్రజాసమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఎంపీపీ దుద్యాల జయమ్మ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని సమస్యల్లో చాలావరకు తీర్చామన్నారు. ఇంకా ఏమైనా ఉన్న సమస్యలను గుర్తించి వాటిని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం వ్యవసాయం, విద్య, పంచాయతీ రాజ్, పశుపోషణ, ఉపాధి హామీ అంశాలపై చర్చ జరిపారు. అధికారులు సభ్యుల ప్రశ్నలకు జవాబులిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నీలామోహన్‌నాయక్, జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మల్కారం విండో చైర్మన్ బూరుకుంట సతీష్, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించాలని నిరసన



తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్

కడ్తాల్, జూన్ 27: కడ్తాలలో నిర్మాణం పూర్తిచేసిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. భవనం ప్రారంభంలో జాప్యంతో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. కేజీబీవీ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏబీవీపీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ముంతాజ్‌కు నాయకులతో కలిసి శ్రీకాంత్ వినతిపత్రం అందజేశారు. భవన ప్రారంభ విషయంలో ప్రజాప్రతినిధులు రాజకీయాలు చేయడం తగదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20రోజులు అవుతున్నా భవనాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. పాఠశాలలో 350 మంది విద్యార్థినులున్నారని, అద్దె భవనం ఖాళీ చేయడంతో విద్యార్థినులను ఆమనగల్లు, కందుకూరులకు పంపడం సరికాదన్నారు. భవనాన్ని వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రాజేశ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కోనేటి అజిత్, రమేశ్, అఖిల్, గణేశ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దంపతులను కలిసిన ఎంపీ రవి కుటుంబీకులు



సీఎం రేవంత్‌రెడ్డి-గీత దంపతులతో ఎంపీ రవిరాజబన్సీ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు

ఆమనగల్లు, జూన్ 27 : నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డిలతో పాటు పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలను కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీగా పదవి ప్రమాణ స్వీకారం చేసిన మల్లు రవికి ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మల్లు సతీమణి డాక్టర్ రాజబన్సీదేవి, కుమారుడు సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

జితేందర్‌రెడ్డిని కలిసిన మల్లు



జితేందర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎంపీ మల్లు రవి, వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 27:ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన ఏపీ జితేందర్‌రెడ్డిని గురువారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జితేందర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.

శంషాబాద్‌లో మోస్తరు వర్షం

శంషాబాద్, జూన్ 27 : శంషాబాద్‌లోని వివిధ బస్తీల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. గత పదిహేను రోజులుగా వర్షం కురియక వేడివాతావరణంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. చిన్నపాటి వానతో ఇప్పుడు చల్లబడింది. రోడ్లపై నీరు నిలిచి పాఠశాలల నుంచి ఇంటికి వెలుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



శంషాబాద్‌లో కురుస్తున్న వర్షం

నేడు రాష్ట్ర ఫుడ్ కమిషన్ బృందం పర్యటన

కొత్తూర్, జూన్ 27: కొత్తూర్ మండలంలో శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ బృందం సభ్యులు పర్యటిస్తారని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌తో పాటు సభ్యులు మండలంలో పర్యటించి పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ చౌకధర దుకాణాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు కమిషన్ బృందం మండలంలో పర్యటిస్తుందని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

రైతులకు సరిపడా ఎరువులు సిద్ధం



పత్తి సాగును పరిశీలిస్తున్నడీఏవో గీతారెడ్డి

ఆమనగల్లు, జూన్ 27: జిల్లాలో వానాకాలం సాగుకు రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్స్ అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు మండలంలో గురువారం గీతారెడ్డి పర్యటించారు. జంగారెడ్డిపల్లిలో వానాకాలం పంటలను పరిశీలించారు. అధిక సాంద్రత పత్తిసాగుపై రైతులకు వివరించారు. సాగులో మెలకువలు పాటించాలని సూచించారు. ఆమనగల్లు, ముర్తూజపల్లిగేటు, విఠాయిపల్లి గ్రామాల్లో ఎరువుల, విత్తనాల దుకాణాలను డీఏవో తనిఖీ చేశారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. రైతులకు విక్రయించిన ప్రతీ వస్తువుకు విధిగా రశీదు ఇవ్వాలన్నారు. జిల్లాలో వానాకాలం సాగు ఆశాజనకంగానే ఉందన్నారు. ఆమె వెంట ఏవో అరుణకుమారి, డీలర్లు చంద్రమౌళి, శరణప్ప, మధు, రాజేశ్, నరేశ్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధిని పెంపొందించేందుకు కృషి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

ఇబ్రహీంపట్నం, జూన్ 27: బ్యాంకు రుణాలిప్పించి మహిళలకు ఉపాధిని కల్పించేలా కృషిచేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజులు పూర్తిచేసుకున్న వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు చొప్పున 75మంది మహిళలకు గురువారం ఇబ్రహీంపట్నంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పది రోజులు శిక్షణ ఉంటుందని, శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇచ్చి స్వయం ఉపాధి రంగాలకు బ్యాంకు రుణాలిప్పిస్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇబ్రహీంపట్నం చుట్టు పక్కల మండలాల మహిళలకూ ఇక్కడే శిక్షణిచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ సంస్థ డైరెక్టర్ రమేష్, ఏడీఆర్డీవో సుభాషిని, ఏపీడీ సక్రియానాయక్, ఎంపీడీవో వెంకటమ్మ, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పకావడి



కప్ప కావడితో ఇంటింటికి తిరుగుతున్న మహిళలు

షాబాద్, జూన్ 27: వర్షాలు కురవాలని తాళ్లపల్లిలో మహిళలు గురువారం గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. నాగర్‌గూడలో కాడికి కప్పలను కట్టి కప్పకావడి నిర్వహించారు. మహిళలు మాట్లాడుతూ విత్తనాలు వేసేందుకు, తుకాలు పోసేందుకు వానల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. వర్షాలు పడి పాడి-పంటలు కలగాలని వరుణదేవున్ని వేడుకున్నామన్నారు.

'మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలి'

షాద్‌నగర్అర్బన్, జూన్ 27: ఎమ్మార్పీఎస్ దండోర ఉద్యమం ప్రారంభమై 30సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా జూలై 7న వరంగల్‌లో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ కోరారు. గురువారం షాద్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పిలుపు మేరకు వచ్చే నెల 5 వరకు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిం కవాతు నిర్వహించాలన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



పుస్తకాలను అందజేస్తున్న జీనుకుంట్ల భాస్కర్

తలకొండపల్లి, జూన్ 27: విద్యార్థులు చిన్నప్పటి నుంచే దేశభక్తి, క్రమ శిక్షణ అలవర్చుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జనుకుంట్ల భాస్కర్ అన్నారు. దేశ నేతలు, సమరయోధుల జీవిత గాథలను తెలుసుకోవాలని సూచించారు. తలకొండపల్లిలోని జెడ్పీ పాఠశాల లైబ్రరీకి భాస్కర్ సొంతంగా 80 స్వాతంత్ర సమరయోధుల, జాతీయ నాయకుల పుస్తకాలను ఇచ్చారు. గురువారం సమితి జాతీయ కోశాధికారి బలరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహలతో కలిసి పాఠశాలకు అందజేశారు. ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు రమేశ్, రాజు, మల్లేశ్, శివ, శ్రీకాంత్, దేవేందర్, మనోహర్, శ్రీను, భరత్, రామలింగం, రామకృష్ణ, మల్లేశ్, శ్రీశైలం ఉన్నారు.

పింఛన్ పెంపును అమలు చేయాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 27: ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేల పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాల్ల జంగయ్య గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే పెన్షన్‌దారులతో కలిసి ఆందోళన చేపడతామంటూ ఆయన హెచ్చరించారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, జూన్ 27: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ప్రభు గురువారం తెలిపారు. కాలేజీ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హిస్టరీ, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, ఫిజిక్స్, క్రాప్ ప్రొడక్షన్ విభాగాల్లో ఒక్కో పోస్టుకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు జూలై ఒకటో తేదీ సాయంత్రం 5 లోపు కళాశాల కార్యాలయంలోగాని ఈ-మెయిల్ ద్వారాగానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని నెట్/స్లెట్ కలిగి పీజీ కలిగిన వారికి తర్వాత ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. బోధనానుభవం ఉన్న వారికి వెయిటేజీ మార్కులు ఇస్తామని ఆయన వివరించారు.

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, కంప్యూటర్ సైన్స్, సెరికల్చర్ ఒక్కో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హత కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.కమల తెలిపారు. అభ్యర్థులు జూలై 1వ తేదీ నాటికల్లా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు 12 వరకు దరఖాస్తుల స్వీకరణ

యాచారం, జూన్ 27 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లకు జూలై 12వ తేదీ కల్లా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని యాచారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదయ్య గురువారం తెలిపారు. పాఠశాలల బదిలీలకు వచ్చే నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు రూ.100ఫీజు ఉంటుందని చెప్పారు.

'పేలుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం'

షాద్‌నగర్, జూన్ 27: షాద్‌నగర్‌లోని ఓ వెంచర్‌లో చేపట్టిన పేలుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు. చౌడమ్మగుట్టపై ఓ వెంచర్‌లో ప్లాట్ల నిర్మాణానికి అక్కడ ఉన్న గుట్టలు, కొండలను పేలుడు పదార్థాలతో తొలగిస్తున్నారు. దీంతో పర్యావరణాకి ముప్పువాటిలుతోందని గురువారం టీడీపీ, బీజేపీ నేతలు ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏసీపీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పేలుళ్లపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. అంతకు ముందు వెంచర్ నిర్మాణంలో భాగంగా కూల్చివేసిన చౌడమ్మగుట్ట యాడీ, వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీడీపీ, బీజేపీ నాయకులు పరిశీలించారు. ఆలయాలను పునర్నిర్మించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. ఈ స్థల వివాదంపై గతంలోనే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. షాద్‌నగర్ పరిసరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోసం పొలాలను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ వెంచర్ల కోసం గుళ్లను కూల్చారని చేశారని అన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఆదుకోవాలి




మంతన్‌గౌరెల్లిలో యువకులతో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ కార్యకర్తలు

యాచారం, జూన్ 27: జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం మంతన్‌గౌరెల్లిలో ఇల్లిల్లు తిరిగి గ్రామంలో ఎంత మంది నిరుద్యోగులున్నారో సర్వే చేశారు. డిగ్రీ, ఇంటర్, పీజీ చదివిన యువకులు ఎంత మంది ఉన్నారు? వారేంచేస్తున్నారని డీవైఎఫ్ఐ కార్యకర్తలతో తిరిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో చాలా మండలాల ఎంతోవో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇన్‌చార్జిలతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తానని ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లిజంగయ్య, చందునాయక్, వినోద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఎస్ఐగా శ్రీనివాసులు

ఆమనగల్లు, జూన్27:ఆమనగల్లు ఎస్ఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన బల్‌రామ్‌నాయక్ హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులుకు ఆమనగల్లులో పోస్టింగ్ ఇచ్చారు. పోలీసు స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ ప్రమోద్ కుమార్‌ను ఎస్సై మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును సిబ్బంది సత్కరించి అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం



కమ్మదనంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్, జూన్ 27: షాద్‌నగర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తామని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నర్సింహులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు ఇంటింటికి తిరిగి గతంలో టీడీపీ ప్రభుత్వాలు చేపట్టిన పథకాల గురించి వివరిస్తామన్నారు. తెలంగాణలోనూ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రణాళికలు రచిస్తున్నామని, త్వరలోనే ఇతర పార్టీలకు టీడీపీ ప్రత్యామ్నాయంగా మారబోతుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ బలోపేతమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, కుమార్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, బాలరాజ్, కిష్టయ్య పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

యాచారం, జూన్ 27: దేశంలో మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని, దీనికి పాల్పడుతున్న నేరగాళ్ల వివరాలను పోలీసులకు తెలపాలని ఇబ్రహీంపట్నం సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీదేవి అన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ నిరోధానికి పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. గురువారం మేడిపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిరోధం, బాధితులకు పునరావాస కల్పన వంటివి ప్రతీ ఒక్కరి బాధ్యతన్నారు. గృహహింస చట్టంపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివలీల, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నరేష్, లీగల్‌సెల్ వలంటీర్లు కృష్ణ, అబ్బయ్య, పప్పి, సబిత ఉన్నారు.

సంక్షిప్తంగా...

● **కొందురు:** మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈవో శ్రీనివాసశర్మ గురువారం కోరారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవాదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ వచ్చిందని, ఆసక్తి ఉన్నవారు గురువారం జూలై 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌కు అందజేయాలని, వివరాలకు తనను సంప్రదించాలని కోరారు.

● **షాద్‌నగర్:** షాద్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయం 21వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు జరిగాయి. మొదటి రోజు ఆలయ ధర్మకర్త కట్ట ప్రవీణ్ దంపతులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నుంచి భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రాఘవేంద్రచార్యులు, ఆలయ ధర్మకర్త కట్ట ప్రవీణ్‌ను ధర్మకర్తలమండలి ఘనంగా సన్మానించింది.

● **షాద్‌నగర్ అర్బన్:** షాద్‌నగర్ పట్టణానికి ముఖ ద్వారంగా ఉన్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన మణికొండ స్వప్నహర్షవర్ధన్ గౌడ్ దంపతులు 2.5కిలోల వెండిని బహూకరించారు. వేంకటేశ్వరుడికి ఖడ్గం, వడ్డాణం, లక్ష్మీ కాసులపేరు, ఉత్సవ విగ్రహానికి కుంభకిరీటం తదితర ఆభరణాలను చేయించాలని వెండిని బహూకరిస్తున్న హర్షవర్ధన్‌గౌడ్ తెలిపారు.

● **యాచారం:** తక్కళ్లపల్లి తండాలో బంగారు మైసమ్మ అమ్మవారికి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అంగోత్ తుకారం తన సతీమణి మానసతో కలసి పూజలు చేశారు.

● **ఆమనగల్లు:**ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్ మర్యాదపూర్వకంగా కలిశారు. వంశీని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించినట్లు ఫరీద్ తెలిపారు. వంశీచంద్‌రెడ్డిని కలిసిన వారిలో కడ్తాల, తలకొండపల్లి ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు షాబుద్దీన్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

● **షాద్‌నగర్:** ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని యువసత్తా డిమాండ్ చేసింది. షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు.

చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి బదిలీ

● నూతన ఇన్‌స్పెక్టర్‌గా భూపాల్‌శ్రీధర్

● డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా రమేశ్‌నాయుడు నియామకం



ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి

చేవెళ్ల, జూన్ 27: సైబరాబాద్ కమిషనరేట్ పరిధి ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ అవినాశ్ మహంతి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మారెడ్డి నగరంలోని ఐటీ కారిడార్‌కు బదిలీ అయ్యారు. సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎం.భూపాల్‌శ్రీధర్ చేవెళ్ల ఇన్‌స్పెక్టర్‌గా రానున్నారు. లక్ష్మారెడ్డి చేవెళ్లలో ఏడాదిగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. అలాగే చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ స్టేషన్లకు కలిపి నూతనంగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పోస్టును ఉన్నతాధికారులు అలాట్ చేశారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి.రమేశ్‌నాయుడును చేవెళ్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా రానున్నారు. ఇప్పటి వరకు శంకర్‌పల్లి, మోకిల స్టేషన్‌లకు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. నూతనంగా మూడు స్టేషన్లకు కలిపి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

షాద్‌నగర్ సీఐ బదిలీ

షాద్‌నగర్: సైబరాబాద్ సీఐలకు స్థానచలనం కల్పిస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ సీఐ ప్రతాప్‌లింగం సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో షాద్‌నగర్ సీఐ నరసింహ మేడ్చల్ సీసీఎస్ విభాగం నుంచి షాద్‌నగర్‌కు రానున్నారు.

'పార్లమెంట్‌లో ప్రజల గొంతుకగా రాహుల్'

ఆమనగల్లు, జూన్ 27:లోక్‌సభలో విపక్షనేతగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎన్నికకావడం హర్షణీయం అని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఏ.ఖలీల్ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో రాహుల్ ప్రజల గొంతుకగా పోరాడుతారని పేర్కొన్నారు. పట్టణంలో గురువారం విలేకరులతో ఖలీల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వ వైఫల్యాలను ఇండియా కూటమి సమర్థవంతం గా తిప్పికొడుతుందని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులకు రూ.2లక్షల లోపు పంట రుణాలను ఆగస్టు 15 వరకు మాఫీ చేస్తుందన్నారు. గ్యారంటీల అమల్లో అనుమానాలు, అపోహలకు తావులేదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు వస్పుల శ్రీశైలం, యాదయ్య, ఫరీద్, అలీం, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

'1.43 లక్షల మొక్కల పెంపకం లక్ష్యం'

ఆమనగల్లు, జూన్ 27: మండలంలో ఈ ఏడాది 13గ్రామ పంచాయతీల్లో 1.43లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎంపీడీవో కుసుమమాధురి తెలిపారు. ప్రతీ పంచాయతీలో 11వేల చొప్పున మొక్కలు సిద్ధం చేశామని చెప్పారు. కోనాపూర్‌లో గురువారం ఆమె పర్యటించి నర్సరీని పరిశీలించారు. మొక్కలన్నీ నాటేందుకు ఏర్పాట్లు చేయాలని, స్థలాలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే పాఠశాలను తనిఖీ చేశారు. కేజీబీవీనీ సందర్శించి విద్యార్థినుల సమస్యలపై ఎస్‌వో పద్మజ్యోతిని అడిగి తెలుసుకున్నారు.